రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో గడుతురు పంచాయితీ గానుగరోలు గ్రామం నుండి పిల్లగూడు గ్రామం వరకు పీఎం జన్మన్ పథకం ద్వారా రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోమటి చిన్నయ్య, మాజీ ఎంపీపీ కొర్ర పద్మ, పలువురు టిడిపి, వైసిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా..

పూర్తికాని రోడ్డు పనులు

» తప్పని డోలీ కష్టాలు » రాకపోకలకు గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి-అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించక పోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అనంతగిరి మండలంలో పెద్దకోట పంచాయతీ బందకొండ రోడ్డు దుస్థితి ఇలా ఉంది. బంగారం మెట్ట మెయిన్ రోడ్ నుండి చీడివలస. మీదుగా పాటిపల్లి, బందకొండ వరకు సుమారు పది కిలోమీటర్ల దూరం బీటీ రింగ్ రోడ్డు పనులు చేపట్టేందుకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద 2024 సంవత్సరంలో మూడు కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. గత ఏడాదిలో పనులు ప్రారంభించారు. మట్టి ఎత్తు వర్క్ పూర్తి చేసి కల్వర్టులు ఏడు మాత్రమే కట్టారు. మిగతా 7 కల్వర్టులు కట్టాల్సి ఉంది. ఈ రోడ్డు పనులు సుమారు 6 నెలల నుంచి నిలిచి పోయాయి. ఇసుక, మెటల్ వంటి మెటీరియల్ రోడ్డు కు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ వదిలేశారు. దీంతో ఈ మధ్యకాలంలో వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్డంతా కోతకు గురి కావడమే కాకుండా రోడ్డుపైకి బండరాళ్లు విరిగి పడుతున్నాయి. రోడ్డు పనులు చేపట్టక ముందు కాలినాడకతో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉండేది. నడక దారి కూడా లేకుండా పోయింది. బైక్‌లు, 108 అంబులెన్స్ వంటి వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఈ మధ్యకాలంలో గర్భిణీ, .బాలింతలను పినకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలంటే డోలిమోతలే శరణ్యంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచిన రోడ్డు పనులను తక్షణమే పూర్తిచేసి ఆయా గ్రామాల ప్రజల కష్టాలు తీర్చాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న రహదారి

రోడ్డు పక్కన ఉన్న కంకర

ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామానికి చెందిన ఓ గర్భిణీ స్త్రీకి గత 20 రోజుల క్రితం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం డోలి సహాయంతో పిన్నకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఇదే కాకుండా ఈ రోడ్డుకి ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన గర్భిణీలు రోగులకు డోలీ మోతలు తప్పడం లేదు

కోతకు గురైన కల్వర్టు

సరైన రోడ్డు లేక ఇబ్బందులు

రోడ్డు పనులు పూర్తి చేయకుండా వదిలివేశారు. దీంతో బంగారు మెట్ట మెయిన్ రోడ్డు నుండి బందకొండ గ్రామం వరకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలి

కాదెల అప్పారావు
బందకొండ గ్రామం
పెద్దకోట పంచాయతీ

అపస్మారక స్థితిలో ఉన్న బాషా

ఆదివాసీ ట్రస్ట్‌కు రూ.34 లక్షల జమ

-అప్పుల్లో కూరుకు పోయిన మెకానిక్ భాషా

-అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆందోళనలో కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని అంతర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదివాసి ట్రస్ట్ బాధితులు వెలుగులోకి వస్తున్నారు. చింతపల్లి కేంద్రానికి చెందిన మెకానిక్ షేక్ బాషా ట్రస్ట్‌పై ఉన్న నమ్మకంతో రూ.34,28,200ల వరకు జమ చేసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఒక ఐడీకి రూ.12,200 చొప్పున జమ చేస్తే, ఏడు దశబ్దాల కాలం పాటు నెలనెలా రూ.3,000 చెల్లిస్తామని ట్రస్ట్ హామీ ఇచ్చినట్లు నమ్మబలికారని, ఈ మాటలు నమ్మిన బాషా అప్పుగా తీసుకున్న డబ్బులతో కలిపి ట్రస్ట్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. హామీ ప్రకారం చెల్లింపులు జరగకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన బాషా మానసికంగా తీవ్రంగా క్షోభకు గురయ్యాడు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని, వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

గిన్నిస్ రికార్డుల కోసం విద్యార్థులకు ఇక్కట్లు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పాడేరు:- యోగాంధ్ర కోసం ఏజెన్సీ నుండి తరలించిన 25వేల మంది విద్యార్థిని విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందించకుండా ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వ తీరును భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)అల్లూరి జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు కె.కార్తీక్ శ్రీను, పి .జీవన్ కృష్ణలు తీవ్రంగా ఖండించారు.ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిన్నిస్ రికార్డు కోసం విశాఖపట్నం వేదికగా యోగా ఆంధ్ర కార్యక్రమం చేపట్టి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. విద్యార్థులను జూన్ 20న తెల్లవారుజామున ప్రత్యేక బస్సుల్లో ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ కు తరలించారని, వారికి సరైన ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారన్నారు. వసతి ఏర్పాట్లు లేక వందల మంది విద్యార్థులు మైదానాల్లో, బస్సుల్లో నిద్రించాల్సిన దుస్థితి కల్పించిందని విమర్శించారు. ప్రభుత్వం బాధ్యతా రహిత్యం స్పష్టంగా కనిపించిందన్నారు. గిన్నిస్ రికార్డుల కోసం విద్యార్థులను ఉపయోగించడం సరి కాదన్నారు. దూర ప్రాంతాల నుండి విద్యార్థిని విద్యార్థులను యోగాంధ్రలో భాగస్తులు చేయడం సరైనటువంటి పద్ధతి కాదన్నారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడల్లో మరింత ప్రోత్సాహం అందించాలని, గిన్నిస్ రికార్డుల కోసం విద్యార్థులను ఇబ్బందులు పెట్టడం సరైనటువంటి పద్ధతి కాదన్నారు. గిరిజన ప్రాంతంలో అనేకమంది విద్యార్థిని ,విద్యార్థులు పౌష్టికాహారం లోపంతో రక్తహీనతతో చనిపోతుంటే పట్టడం లేదన్నారు. విద్యార్థులకు అవసరమైనవన్నీ చేయకుండా అనసరమైన వాటిలో భాగస్వామ్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

నిరసన దీక్షకు సంఘీభావం తెలపాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23, 24న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట కొండ సర్పంచ్ వేట్ల విజయ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన దీక్షకు సంఘీభావం తెలపాలని పలువురు కోరారు. పోలవరం ప్రాజెక్టు ప్రారంభమై 20 సంవత్సరాలు గడిచిపోయినా ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన వారి పట్ల వివక్షత ఈనాటికి కొనసాగుతుండటం చాలా బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్అండ్ఆర్‌కు తన బాధ్యత లేదంటూ తప్పుకుంటూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటం తగదన్నారు. ఇటువంటి పలు సమస్యలపై ఈ నిరసన దీక్షలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

నైట్ బస్ సర్వీసులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో తిరిగే నైట్ సర్వీసు బస్సులను పునరుద్ధరించే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు. ఇటీవల రంపచోడవరం డివిజన్ అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. మన్యంలో తిరిగే నైట్‌సర్వీస్ బస్సులు మావోయిస్టులు లక్ష్యంగా చేసుకుని దుశ్చర్యలకు పాల్పడవచ్చని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మూడు రోజుల పాటు నైట్‌బస్సు సర్వీసులు నడపవద్దని పోలీసులు ఆర్టీసీ అధికారులు ఆంక్షలు విధించారు. గడువు ముగిసినప్పటికీ బస్ సర్వీసులు పునరుద్ధరించడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఆదివారం నుంచి పాడేరు వయా సీలేరు మీదుగా భద్రాచలం విశాఖ వయా సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్‌సర్వీస్ బస్సులు విశాఖ- సీలేరు నైట్‌హాల్ట్ పునరుద్ధరించవలసి ఉంది. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రయాణికులు విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి నైట్ సర్వీసులు ఆదివారం నుంచి పునరుద్ధరించారా? లేదా? అని ఆరా తీసినప్పటికీ ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆర్టీసీ కంట్రోల్ రూమ్ అధికారులు పేర్కొన్నారు. పగటిపూట నడిచే విశాఖపట్నం వయా సీలేరు మీద వెళ్లే భద్రాచలం బస్ సర్వీస్ మాత్రమే తిప్పుతున్నారు. నిలిపివేసిన విజయవాడ -సీలేరు బస్సు సర్వీసును ఆదివారం ఉదయం నుంచి పునరుద్ధరించారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నైట్ బస్ సర్వీసులు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

11 మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - రంపచోడవరం : 11 మంది జూదరులను అరెస్టు చేసినట్టు అదుపులోకి తీసుకున్నామని దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మండలంలోని సీతపల్లి బాపనమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు జరిపిన దాడిలో సుమారు 11 మందిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుండి 11 బైకులు, మొబైల్ ఫోన్లు సుమారు రూ.49 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ షరీఫ్ తెలిపారు . వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి- కూనవరం: మండలంలోని రేపాకలో సర్పంచ్ నాగమణి అధ్యక్షతన స్థానిక ప్రజాప్రతినిధుల సమావేశం ఆదివారం నిర్వహించారు. వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీలను చాలా నిర్లక్ష్యం చేస్తున్నాయని సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు అంటే చాలా చులకన భావంతో చూస్తున్నారని దుయ్యబట్టారు. గత సంవత్సరం కాలం నుంచి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీలు మరీ నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కనీసం పంచాయతీలో వారికి రావాల్సిన మూడు విడతల నిధులను ఇంతవరకూ విడుదల చేయలేదని, పంచాయతీలో త్రాగునీరు, బ్లీచింగ్ ఇతర చిన్నచిన్న సమస్యలు ఎలా పరిష్కరం అవుతాయని వారు ప్రశ్నించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలాల వారీగా రావాల్సిన మెటీరియల్ కాంపౌండెంట్‌ని మైదాన ప్రాంతాలలో అభివద్ధి కార్యక్రమాలకు ఖర్చుపెట్టి ఏజెన్సీ ప్రాంతాలని మోసం చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. కొన్ని సంవత్సరాలుగా గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా తయ్యారయ్యాయని ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ధర్మల అమ్మాజీ, కూటూరు సర్పంచ్ బొగ్గ వెంకమ్మ, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రాయ్య, పార్టీ సీనియర్ నాయకులు మడకం జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసా అధ్యక్షుడినని చెప్పుకోవడం సమంజసం కాదు

ప్రజాశక్తి - కొయ్యూరు: పీసా కమిటి ఎన్నికలు రద్దయ్యాయని, పీసా కమిటి అధ్యక్షుడిని అని చెప్పుకుని తిరగటం గోకిరి చెన్నారావు, స్వామినాయుడుకు సమంజసం కాదని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు ఎస్.సూరిబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. ఒకవేళ ఎన్నికలు జరిగినా గోకిరి చెన్నారావు, స్వామినాయుడును ఎవరూ ఎన్నుకోరన్నారు.

ఉయ్యాలలో ఊగుతున్న పర్యాటకుడు

చింతలూరు కాఫీ తోటలో..

ఆకర్షిస్తున్న పిట్టగూడు ఉయ్యాల

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని చింతలూరు కాఫీ తోటల్లో పర్యాటకుల మనసులను మురిపించేలా వన సంరక్షణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వినూత్న ప్రాజెక్టును అమలు చేశారు. పచ్చటి కాఫీ తోటల మధ్య మామిడిచెట్టుకు చెక్కతో రూపొందించిన మంచం, పిట్టగూడు ఆకారంలో ప్రత్యేక ఉయ్యాల ఏర్పాటుతో ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. ఈ ఉయ్యాలు ప్రకృతి ఒడిలో సేద తీరాలనుకునే వారికి కొత్త అనుభూతిని అందిస్తుంది. చల్లని పర్వత ప్రాంతాలు, కాఫీ తోటల మధ్య ఏర్పాటైన ఈ వేదిక ప్రకృతి ప్రేమికులకు మధుర జ్ఞాపకాలుగా నిలుస్తోంది. లంబసింగి పర్యాటక ప్రాంతంలోని తాజంగి జలసాయం, చెరువుల వెనం, స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంను సందర్శించిన అనంతరం పర్యాటకులు చింతలూరు కాఫీ తోటకు చేరుకొని పిట్టగూడు ఉయ్యాల్లో ఊగుతూ ఆనందం పొందుతున్నారు. ఈ ప్రత్యేక ఆవిష్కరణ స్థానిక యువతలోనూ ఉత్సాహాన్ని కలిగిస్తోంది. సెల్ఫీలు, ఫోటోసూట్లు, వీడియోలతో ఈ ప్రాంతం సోషల్ మీడియా వేదికలపైనా ప్రాచుర్యం పొందుతోంది. ప్రతి ఏడాది పర్యాటక సీజన్‌లో ఇలాంటి వినూత్న మార్గాల ద్వారా మరింత మంది సందర్శకులను ఆకర్షించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వన సంరక్షణ అభివృద్ధి సంస్థ చేపట్టిన ఈ వినూత్న ప్రాజెక్టు పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని పర్యాటకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ప్రయోగాన్ని మరింత విస్తరిం చాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయ పడుతున్నారు.

సుందరంగా ఉన్న మార్గం

చెట్టుపై ఎక్కేందుకు ఏర్పాటు చేసిన నిచ్చెన

ఆదివాసీల గుండె చప్పుడు.. భూమి పండగ

ఒక్కో గ్రామంలో.. ఒక్కో రోజు..
ఏడాదంతా బాగుండాలని చేసే ఉత్సవం
సమిష్టితత్వానికి నిదర్శనం

నృత్యం చేస్తున్న మహిళలు

డోలు వాయిస్తూ నృత్యం చేస్తున్న గిరిజన యువకులు

ప్రజాశక్తి - చింతూరు : ఆదివాసి గిరిజనులకు అతి పెద్ద తొలి పండుగ అడవితల్లి ఒడిలో భూమిపండుగ వస్తుంది. అనాది నుండి ఆదివాసీలు ఆనవాయితీగా భూమి పండుగ చేస్తుంటారు. వారి జీవితాల్లో తొలి ఏడాది పండుగ నిర్వహిస్తుంటారు. ఈ పండుగ సందర్భంగా గిరిజన పల్లెల్లో మహిళలు సమిష్టిగా కలిసి రోడ్ల పైకి వచ్చి రేలా పాటలు పాడుతూ వాహనదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తుంటారు. ఇలా వసూలైన మొత్తం అందరూ కలిసి గ్రామంలో సమావేశమై పండుగకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి పలురకాల వంటకాలను వండుతారు. దీనికి ముందుగా గ్రామంలో ఉన్న పురుషులందరూ విధిగా సమీప అడవిలోకి విల్లంబులు చేత పట్టుకుని పెంపుడు కుక్కలను వెంట తీసుకుని అంబలి జావ సీసాల్లో నింపుకొని వేటకై అడవిబాట పడతారు. వేటాడిన జంతువును గ్రామానికి మోసుకువచ్చి ప్రతి కుటుంబానికి వాటాలుగా పోగులు వేసి పంచుకుంటారు. వేటకు వెళ్ళిన పురుషులు వేట సజావుగా జరిగి వేటలో జంతువు చిక్కాలని పురుషులను అడవికి మహిళలు సాగనంపుతారు. తొలుత గ్రామంలో భూమి పండుగకు కావలసిన పూజలు చేస్తారు. అడవి తల్లి కరుణించాలని కొందరు కోడిగుడ్లను బాణాలతో కొట్టి వేటకు సుముహూర్తం ఖరారు చేస్తారు.

వేటలో వేట కుక్కల ప్రాధాన్యం ఎక్కువ..

అడవిలో వేటకు వెళ్లిన వేటగాళ్లకు జంతువు ఏదైనా కనపడినప్పుడు అది పారిపోకుండా తమ వెంట తెచ్చుకున్న పెంపుడు కుక్కలను ఉసిగొలుపుతారు. వెంటనే అవి జంతువును చుట్టుముట్టి ఎటూ వెళ్లకుండా కట్టడి చేస్తాయి. ఇది అదునుగా చూసుకొని వేటగాళ్లు నాలుగు దిక్కులకూ చేరుకుని విల్లంబులు ఎక్కుపెట్టి జంతువులను వేటాడతారు. వారు పెంచుకున్న పెంపుడు కుక్కలు కూడా వేటగాళ్లకు సహకరిస్తూ వేట విజయవంతం అవడానికి సహకరిస్తుంటాయి.

సమిష్టి తత్వానికి భూమి పండుగ నిదర్శనం

ఆదివాసి గిరిజన ప్రజలు గ్రామంలో అందరూ కలిసి భూమి పండుగ కోసం రచ్చబండ వద్ద సమావేశమై పండుగ ఎప్పుడు ప్రారంభించాలి. వేటకు ఎప్పుడు వెళ్లాలి కార్యక్రమాలు ఏ విధంగా ప్రారంభించాలి అనే చర్చను గ్రామపూజారి పటేల్ గ్రామపెద్దలు సమక్షంలో చర్చలు నిర్వహిస్తారు. అనంతరం ఒక రోజును నిర్ణయించి ఆ రోజు నుంచి గ్రామంలో మూడు రోజుల పాటు అడవిలో వేట గిరిజన మహిళలు రేలా పాటలు. డబ్బు, వస్తువులు వంటి కార్యక్రమాలు నిర్ణయించబడతాయి.

రేలా పాటలతో డోలు కొమ్ములతో ఆటపాటలు

భూమి పండుగ చివరి రోజు గ్రామంలో ఆదివాసీ స్త్రీ పురుషులు కలిసి రేలా పాటలు పాడుతూ పురుషులు డోలు కొమ్ములతో పండుగ సందడి చేస్తారు. మహిళలు ఒకరినొకరు భుజాలపై చేతులు వేసి లయబద్ధంగా అడుగులు వేస్తూ నీటిపై అలల వలె వత్తాకారంలో తిరుగుతూ పాటలు పాడుతూ కనువిందు చేస్తారు. ఒక్కో గిరిజన గ్రామంలో ఒక్కోరోజు ఈ భూమి పండుగను నిర్వహిస్తుంటారు. పల్లె, పల్లె వాడవాడలా రేలా పాటలు పాడుతూ ఆలాపన చేస్తూ అందరు గొంతు కలిపి పాడే రేల పాటలు ఎంతో మాధుర్యాన్ని కలిగి ఉంటాయి. పాటల్లో హాస్యం, కవ్వింపు, పొగడ్తలు, వెటకారం, మమకారం, వేళాకోళం, ఆటపట్టింపు వంటి పదాలతో రేలా పాటలు పాడుతారు.

అడవిదున్న కొమ్ములే ఆదివాసీ కళాకారుల కిరీటాలు..

అడవిలో వేటాడి అడవి దున్నల కొమ్ములను నరికి రంగురంగుల వస్త్రాలతో తలపాగాలా చుట్టి కొమ్ములను వాడిగా చేసి వాటిపై నెమలి పింఛాలను అలంకరించి ఒక పొడవైన వస్త్రాన్ని వెనుక భాగంలో కాళ్ల వరకూ వేలాడేలా తలపాగాను చుట్టి ఆదివాసి కళాకారుల తలపాగాను తయారు చేస్తారు. నేలపై ఉన్న చిన్న వస్తువును తను ధరించిన అడవిదున్న కొమ్ములతో తీసేందుకు ఒకరినొకరు పోటీపడుతూ తలపడతారు.

కొందరు రూపాయి నోట్లను నేలపై వేసి తలకు ధరించిన అడవిదున్న కొమ్ములతో వాటిని తీస్తుంటారు. ఈ క్రమంలో కొద్దిగా అదుపు తప్పితే ఎదుట వారి శరీరంలో తలపాగాకు అమర్చిన అడవిదున్న కొమ్ములు దూసుకుపోతాయి. అలా జరగకుండా ఒకరినొకరు జాగ్రత్తపడుతూ రేలా పాటలకు అనుగుణంగా డోలు వాయిస్తూ కొమ్ములను విదిలిస్తూ నత్యం ప్రదర్శిస్తుంటారు.

జోరుగా చేపల విక్రయాలు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు నదిలో చేపలు విరివిగా లభ్యమవుతున్నాయి. కొద్ది రోజుల నుంచి సీలేరు పరిసర ప్రాంతాల్లో అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి.కొత్తనీరు చేరుతుండడంతో చేపలు పైకి వస్తుంటాయి. ఈ క్రమంలోనే మత్స్యకారుల వలలకు డోబి, రవ్వ, గండుమేను, ఇతర జాతులకు చెందిన వివిధ రకాల చేపలు చిక్కుతున్నాయి. సీలేరు కొన్ని కిలోమీటర్ల దూరంలో బెంగాలి క్యాంపు సమీప నదిలో చేపలు ఎక్కువగా లభ్యమవుతున్నాయి. కిలో 220 రూపాయలు చొప్పున విక్రయాలు జరుపుతున్నారు. నది చేపలు కొనేందుకు స్థానికులు ఆదివారం ఎగబడ్డారు.

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులు

బదిలీల్లో న్యాయం చేయాలంటూ ఉపాధ్యాయుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : మినిమం టైం స్కేల్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గిరిజన ప్రాంతాలకు బదిలీచేయాలనే నిర్ణయం వెంటనే మానుకోవాలని ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఆదివారం డిఇఒ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. తమకు అందిస్తున్న అతి తక్కువ జీతాలు కుటుంబనిర్వహణకే సరిపోవని ఇప్పుడు గిరిజన ప్రాంతాలకు బదిలీలు చేస్తే రవాణా చార్జీలు అదనపు భారం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నగరానికి వచ్చిన విద్యాశాఖా మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతి పత్రాలు అందించామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిలింగ్‌ను బహిష్కరింస్తున్నామని జెఎసిగా ఏర్పడి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. నిరసనలో భాగంగా జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద మంగళవారం ఆందోళన చేస్తామని జెఎసి ప్రతినిధులు కేవీ దుర్గాదేవి, డి.జ్యోతి, టి.లింగమూర్తి, రాజు, మూర్తి, పెనగంటి శ్రీనివాసరావు, శిరికి సూర్యనారాయణ తెలిపారు.

'బాక్సైట్'పై ఆదివాసీల్లో ఆందోళన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉమ్మడి విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాల్లో ఆదివాసి యువతకు ఉపాధి ఎలా కల్పించవచ్చో బాక్సైట్ శుద్ధి జరుగుతున్న ఒడిశా వెళ్లి అధ్యయనం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలు ఆదివాసీల్లో ఆందోళన రేకెత్తించిందని, కూటమి ప్రభుత్వం బాక్సైట్ జోలికి వెళితే ఆదివాసీల్లో మళ్లీ అలజడి తప్పదని విదసం (విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయంపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మన్యంలో చింతపల్లి, అనంతగిరి, అరకు మండలాల్లో బాక్సైట్ తవ్వకాలు, మాకవరపు పాలెంలో అల్యూమినియం తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అన్ రాక్ కంపెనీ ఏర్పాటుకు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతో మన్యంలో ఎగిసిన ఉద్యమం, దానికి మద్దతుగా జరిపిన పాదయాత్రలు, జిఒ 97పై జరిగిన పోరాటాలు, టిడిపి ఎమ్మెల్యేలు సివేరి సోము, కిడారిలను మావోయిస్టులు కాల్చి చంపడం తదితర చేదు అనుభవాలను మర్చిపోకూడని గుర్తు చేశారు. 2019లో జగన్ ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలను రద్దు చేస్తూ గతంలో టిడిపి ఇచ్చిన 97 జిఒను రద్దు చేసిన విషయాన్ని ప్రజలు గమనిస్తారని తెలిపారు. మళ్లీ బాక్సైట్ జోలికి వస్తే ప్రజామోదం కాదని స్పష్టం చేశారు. ఒడిశాలో బాక్సైట్ తవ్వకాల కారణంగా అక్కడ ప్రజలు అడివిపై సహజ జీవన హక్కు, నివాసాలు, బతుకుతెరువు కోల్పోయి, తాగునీరు రంగుమారి కలుషితమై అనారోగ్యాలకు గురైన చరిత్ర కళ్లముందు ఉండగా మళ్ళీ కూటమి సర్కారు కేంద్రం అడిగిందని బాక్సైట్ జోలికి వెళితే తేనె తుట్టను కదిలించినట్టేనని హెచ్చరించారు.

'యువత పోరు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఈ నెల 23న జరగనున్న యువత పోరులో నియోజకవర్గంలోని యువకులంతా పాల్గొనాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సమస్యలపై ఈ కార్యక్రమానికి సంబందించిన గోడపత్రికను మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మీడియాతో మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు 3 వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి, నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదన్నారు.

పరిహారం చెల్లించాలని గిరిజనుల వినూత్న నిరసన

దుక్కి దున్నుతూ వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: పెద్దపులి దాడిలో బలైన తమ మూగజీవాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు నాగళ్ళు భుజంపై పెట్టుకొని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి బూరిగ, చిన్నకోనెల గ్రామాలకు చెందిన గిరిజనులు ఆదివారం తమ వ్యవసాయ భూమి వద్ద వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమ్మెల .అప్పలరాజు మాట్లాడుతూ, ఎత్తైన కొండ శిఖరాలు, దట్టమైన అటవీ ప్రాంతంలో తమ నివాస గ్రామాలు ఉన్నాయని, 2023 సంవత్సరంలో సోమ్మెల. పైడమ్మ, సోమ్మెల. చిన్న, గంగమ్మ, కోటపర్తి. గంగులు, .కరాశి. లచ్చుమ్మ, బూరిగ. గౌరమ్మ ఐదుగురు రైతులకు చెందిన మూడు ఆవులు, నాలుగు దుక్కటి ఎద్దులు పులి దాడికి గురైనట్లు ఫారెస్టు అధికారులకు పిర్యాదు చేశారు. పులి దాడులకు పాల్పడిన ఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం బెంగాల్ టైగర్ దాడికి పాల్పడినట్లు అధికారులు నిర్ధారించారన్నారు. ఎదులు లేక వ్యవసాయ పనులు చేయలేకపోతున్నామని, తమకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఫారెస్ట్ అధికారులకు అయిదుగురికి సంబంధించిన ఆధార్, బ్యాంక్ అకౌంట్ వంటి జెరాక్స్ కాపీలు ఫారెస్ట్ అధికారులకు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఒక్క ఆవుకు రూ.15000 చొప్పున మొత్తం 45 వేల రూపాయలు, దుక్కటేద్దు ఒకదానికి 25 వేల రూపాయలు చొప్పున మొత్తం నాలుగు ఎద్దులకు లక్ష రూపాయలు చొప్పున పరిహారం చెల్లించేందుకు అధికారులు అంగీకరించారని, నేటికీ మూడు సంవత్సరాలు గడిచిపోతున్నా ఆ ఊసే లేదని తెలిపారు. ఇప్పటికైనా ఫారెస్ట్ ఉన్న అధికారులు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం నుండి తమకు వచ్చే ఆర్థిక సహాయాన్ని వెంటనే నెల రోజుల్లో చెల్లించాలని, లేకుంటే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

రోడ్డు సదుపాయం కల్పించాలి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం నేత రామన్న

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని ఇర గాయి పంచాయతీ మారుమూల గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని సిపిఎం మండల కమిటీ సభ్యుడు పి.రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం మారుమూల గాతపాడు, నంద గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరగాయి తోటవలస నుండి నంద వరకు రోడ్డు సదుపాయం లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. తోటవలస, బోరకొండ, సోరుపోదర్, పెద్దగరువు, దోనుగుమి, జరలాంగీ, కారమాన్ వలస, గాతపాడు, నంద గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ గ్రామాల్లో సుమారు 2000 మంది జనాభా జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఆరోగ్యం సమస్య వచ్చినప్పుడు ఆస్పత్రికి రావాలంటే అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అరకులోయ మండల కేంద్రం నుంచి ఈ గ్రామలకు సుమారు 30 కిలోమీటర్లు ఉందన్నారు. గ్రామాలకు కనీసం రోడ్డు సదుపాయం కల్పించాలనే ఆలోచన అధికారులకు, ప్రజాప్రతినిధులు లేదని మండి పడ్డారు. ఎన్నికలు సమయంలో మాత్రం రాజకీయ నాయకులు ఓట్లు కోసం గ్రామాల్లో వస్తారు తప్ప గెలిచాక తమ గ్రామాలకు రోడ్డు, మంచి నీరు, వివిధ సమస్యలపై ఎవరు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు విమర్శించారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు సదుపాయం కల్పించకపోతే భవిష్యత్తులో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్ శంకర్‌రావు, ఎం సురయ్య, జె.సుబ్బారావు, సన్యాసి, డి.భాస్కరరావు, జె తిరుపతి, ఎం.సీతమ్మ, మారకమ్మ, పార్వతీ, పి చిన్నమి గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: సమస్యలు పరిష్కరిం చాలని మున్సిపాల్టీ ఇంజనీరింగ్ కార్మికులు సబ్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన ఆదివారం మూడో రోజు చేరుకుంది. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ కళ్ళకు గంతల కట్టుకొని మోకాళ్ళతో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నిరసన కొనసాగించారు. అత్యవ సర సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 చొప్పున జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. పదేళ్ల సర్వీసు పైబడిన వారిని క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాకిరెడ్డి అప్పలనాయుడు, మహేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్ : అనకాపల్లి హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలమరశెట్టి దామోదర్ వీరునాయుడు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించి, వైద్యసేవలు అందిస్తున్నారు.క్షతగాత్రుని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖరం తెలిపారు.

తాటాకు ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్. ఏర్రవరం గ్రామంలో మాదల రాముకు చెందిన తాటాకు ఇళ్లు ఆదివారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.30వేల నగదు, 3 తులాల బంగారం, వెండి వస్తువులు, బట్టలు, బియ్యం, ఇంటి సామాన్లు, ఆధార్ కార్డులు, పట్టాదారు పాసు పుస్తకం మొత్తం పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయినట్లు మాదాల రాము తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ సిఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యాన ఆదివారం మల్కాపురం పోలీసులు మూడు బృందాలుగా వెళ్లి బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 3 బెల్ట్ షాపులపై దాడి చేసి 25 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు.

వాటర్ ట్యాంక్ పై నుంచి పడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల నాలుగో అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌పై నుంచి శనివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో ప్రమాద వశాత్తూ జారి కింద పడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి చెందింది. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా, పాచిపెంట మండలం, గొలుగువలస గ్రామానికి చెందిన తెర్లపు ఆదిలక్ష్మి (38), భర్త శివ సుమారు నాలుగేళ్లుగా రఘు ఇంజినీరింగ్ కళాశాలలో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి పడుకునేందుకు వీరిద్దరు భవనం కింద ఫ్లోర్‌లో ఉన్న గదికి వెళ్ళారు. సంబంధిత గదికి తాళం వేసి ఉండడంతో నాలుగో ఫ్లోర్‌కు వెళ్లి చల్ల గాలి కోసం అదే ఫ్లోర్‌కు సంబంధించి వాటర్ ట్యాంక్ పైకి వెళ్లారు. రాత్రి 8 గంటలకు ఆదిలక్ష్మి వాటర్ ట్యాంక్ దిగుతూ ప్రమాద వశాత్తూ కాలు జారి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సంగివలస ఎఎన్‌హెచ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.గౌరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రేమించిన యువతితో తగాదా పడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాధా ఢిల్లేశ్వర్‌రావు (24) మద్దెలపాలెంలోని అలయన్స్ కాలేజీలో మూడో సంవత్సరం హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. మొదట్లో మద్దిలపాలెంలోని ప్రైవేటు హాస్టల్‌లో ఉండేవాడు. ఆరోగ్య కారణాల వల్ల తన స్నేహితుడు నీలాచల్ పాండాతో కలిసి మద్దిలపాలెం చైతన్యనగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ప్రస్తుతం ఉంటున్నాడు. ఈమధ్యనే సిరిపురంలోని వి హోటల్‌లో రెండు నెలలు ట్రైనీగా చేరాడు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం తాగిన మత్తులో ప్రేమించిన యువతితో గొడవపడ్డాడు. అనంతరం తన మిత్రుడు బయటికి వెళ్ళిన సమయం చూసి ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు కరెంటు వైరుతో ఉరేసుకుని చనిపోయాడు. ఈ విషయమై అతని తండ్రి రాధాశ్రీను ఆదివారం ఉదయం ఎంవిపి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

180 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని వంచంగి గ్రామ సచివాలయం వద్ద విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్ వైద్యులు జి.శేషగిరిరావు. సి.హెచ్ నాగు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 180 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని మాజీ సర్పంచ్ తమదాల సరస్వతి, సత్యనారాయణ దంపతులు పర్యవేక్షించారు. పరీక్షల అనంతరం మందులు ఉచితంగా పంపిణీ చేశారు. 17 మందిని కంటి శస్త్రచికిత్సల నిమిత్తం తరలించనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంట్రు మాణిక్యం, గ్రామపెద్దలు డబ్బా రాజమోహన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అండర్ -13 టేబుల్ టెన్నిస్‌లో మోహితాక్షితకు ద్వితీయస్థానం

షీల్డ్‌తో మోహితాక్షిత

ప్రజాశక్తి -సీలేరు: విశాఖపట్నం గోపాలపట్నం హైస్కూల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఎంఎల్ఎ 2025 జిల్లాస్థాయి అండర్ 13 టేబుల్ టెన్నిస్ పోటీల్లో జికె వీధి మండలం సీలేరుకు చెందిన ఎం. మోహితాక్షిత ద్వితీయస్థానంలో నిలిచింది. ఎపి జెన్‌కోలో జెఇఒగా పనిచేస్తున్న ఎం.జోగారావు కుమార్తె మోహితాక్షిత విశాఖలోని అక్కయ్య పాలెం నారాయణ కళాశాలలో ఆరో తరగతి చదువుతోంది. గోపాలపట్నంలో ఆదివారం నిర్వహించిన బాలికల అండర్ 13 ఎంఎల్ఎ కప్పులో పాల్గొని జస్మితతో తలపడి 11-8-13-11 14-12 స్కోరుతో 3.0 సాధించి ఫైనల్ చేరింది. ఫైనల్ టి.సాన్వితో తలపడి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్థానిక ఎపి జెన్కో అధికారులు, ఇంజనీర్లు జోగారావుని అభినందించారు.

తండ్రి చెంతకు తెలంగాణ మహిళ

తండ్రి వద్దకు చేరిన ఆసియా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆసియా (29) అనే అవివాహిత మహిళను ఏప్రిల్‌లో రైల్వేస్టేషన్‌లో ఎయుటిడి సిబ్బంది రెస్క్యూ చేసి కాపాడారు. సరూర్‌నగర్ జిల్లాలో 'వాడి' అనే గ్రామం నుండి ఇంట్లో చెప్పకుండా ఆమె పారిపోయి వచ్చేసింది. గత రెండేళ్లుగా ఈమె మానసిక వ్యాధితో బాధపడుతోంది. తండ్రి హాస్పిటల్లో చేర్చే ప్రయత్నం చేయడంతో గొడవపడి, ఇంట్లో సామాన్లు తగలబెట్టి ఎవరితో చెప్పకుండా వచ్చేసింది. ఈమెను జివియంసి టిఎస్ఆర్ షెల్టర్లో ఉంచి శ్రద్ధా మెడిసిన్ వాడించడంతో కోలుకుంది. ఆదివారం ఆసియాను వైజాగ్ నుంచి నేరుగా తీసుకుని వెళ్లి తండ్రి అహ్మద్ హుస్సేన్‌కి క్షేమంగా అప్పగించడం జరిగిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు.

చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు

మాట్లాడుతున్న రాష్ట్ర బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు కేశన శంకరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలో అన్ని ఒబిసి సంఘాలు గల్లీ నుండి ఢిల్లీ వరకూ పోరాడి ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, జనగణనతో పాటే సమగ్ర కులగణనను సాధించాయని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. ఇకపై జనాభా థామాషా మేరకు చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 27న కులగణన కోసం విజయవాడలో అంతిమ పోరాటంగా వేలాది మందితో నిర్వహించిన ర్యాలీని భగ్నం చేసి, పోలీసులు తన పట్ల ఎంతో పాశవికంగా ప్రవర్తించి, అరెస్టు చేశారో, దేశ ప్రజలందరూ కళ్ళారా చూశారన్నారు. అయినా సరే అదే రోజు కార్లు, మోటారు సైకిళ్ళతో ర్యాలీగా కళాక్షేత్రం వరకు వెళ్లి,మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. మే 30న కేంద్ర మంత్రిమండలి కులగణనకు ఆమోదం తెలిపిందన్నారు. ఆపై షెడ్యూల్ ప్రకటించడం, జూన్16వ గెజిట్‌లో ముద్రించడం చకచకా జరిగిపోయాయన్నారు. ఒబిసిల కులగణనకు, రిజర్వేషన్లకు ఆర్ఎస్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అయినప్పటికీ కులగణనకు ఆమోదం రావడం హర్షణీయమన్నారు.ఒబిసిల సాధికారిత కోసం కులగణన ప్రక్రియను వేగవంతం చేశారని తాము భావిస్తున్నామన్నారు. జనాభా థామాషా మేరకు ఒబిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే నినాదంతో దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధపడుతున్నామన్నారు. బిసిలకిచ్చిన ఎన్నికల వాగ్దానం మేరకు 33 శాతం రిజర్వేషన్ చట్టపభల్లో కల్పించేందుకు, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవడం కాదని, పార్లమెంటులో చట్టం అయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ని శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించి అందులో ఒబిసి మహిళలకు ఎంత వాటా ఇస్తున్నారో స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయిలో చట్టసభల్లో మంత్రి స్థాయి పదవులు కల్పించాలని కోరారు. సమావేశంలో బిసి నాయకులు పోలాకి శ్రీనివాసరావు, గొర్లి శ్రీనివాస నాయుడు, కామన వెంకట సుబ్బారావు, ఎం.సుభాష్ చంద్రబోస్,పల్లా రమణ అన్నవీరపు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల దక్షిణ నియోజవర్గంలో వైసిపి పార్టీ పదవులు పొందిన వారు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం పనిచేయాలని వైసిపి దక్షిణ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపు ఇచ్చారు. వైసిపి 35వ వార్డు అధ్యక్షుడిగా నియమితులైన అలుపున కనకరెడ్డి దంపతులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్ సత్కరించారు. పార్టీ విశాఖ సౌత్ పబ్లిక్ వింగ్ సెల్ అధ్యక్షులు జీరుసూర్యనారాయణ, (సుధా)వినోద్, దుర్గాప్రసాద్, సిటీ సెక్రెటరీ అబ్బిరెడ్డి ఆది విష్ణురెడ్డి పాల్గొన్నారు.

38వ వార్డు వైసిపి అధ్యక్షుడు రవికి అభినందనలు

చేపల నూకరాజు ఆధ్వర్యంలో వైసిపి 38వ వార్డు అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గురజాపు రవి అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరై గురజాపు రవిని సత్కరించారు. నిత్యావసర సరుకులు, చీరలను వాసుపల్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, వైసిపి సీనియర్ నేత పాటోజు ప్రసాద్ పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఘనంగా మహాకవి శ్రీశ్రీ వర్ధంతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం శ్రీశ్రీ గేయాలను ఆలపించారు. శ్రీశ్రీ గొప్పతాన్ని తెలిపేలా కవితలు వినిపించారు. పద్యాలు పాడారు. నృత్యాలు చేశారు. హాజరైన శ్రోతలందరి ప్రశంసలు అందుకున్న ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.మణి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంటి, నాయకులు ఎస్‌వి.రమణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు, గాయకులకు, పలువురి శ్రోతలకు ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మనిషి ఎదుగుదలలో విద్య కీలకపాత్ర

- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరి జీవితంలో ఎదుగుదలకు విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలను చదివించాలన్నారు. విశాఖ జిల్లా పెరిక కుల సంక్షేమ సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం పాత నగరంలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, విశాఖ జిల్లా పెరిక సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన అక్కిరెడ్డి జగదీష్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిక సంఘం సామాజిక సంఘ భవన నిర్మాణంలో తమ వంతు సహాయ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు జగదీష్, కార్యవర్గ సభ్యులు, కులసంఘం పెద్దలు, సంధ్యరాణి పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిసిల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజు గౌడ్ యాత తెలిపారు. ఆదివారం గ్రీన్‌పార్క్ హోటల్ జంక్షన్‌లో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ,కులగణన చేపడుతున్న ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండు దశల్లో జరగబోయే ఈ జనగణన 2026 అక్టోబర్ 1న ప్రారంభమై మార్చి 1, 2027న ముగియబోతోందన్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దాదాపు ఆరు నెలలపాటు జరిగే ఈ లెక్కింపులో 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు 1.34 లక్షల మంది సిబ్బంది పాల్గొంటున్నారన్నారు.

ఐఎన్ఎస్ నీలగిరి

తూర్పు నావికాదళంలోకి ఐఎన్ఎస్ నీలగిరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రాజెక్టు 17 ఎ స్టేల్త్ ఫ్రిగేట్ శ్రేణిలో భాగంగా నిర్మించిన మొదటి నౌక ఐఎన్ఎస్ నీలగిరి తన స్వస్థల నౌకాశ్రయమైన విశాఖకు చేరుకుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ముంబయిలోని మజాగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్‌లో ఈ నౌక నిర్మాణం 2019 సెప్టెంబర్ 28న ప్రారంభమైంది. పనులన్నీ పూర్తయి ఈ ఏడాది జనవరి 15న భారత నౌకాదళంలోకి ప్రవేశించింది. ఇది పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది. తూర్పు నౌకాదళ కమాండ్‌లో ఈ నౌక ఈస్టర్న్ స్వోర్డ్-సన్‌రైజ్ ఫ్లీట్‌లో కీలక భాగంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఎన్నో ప్రత్యేకతలు

శత్రు రాడార్‌లకు కనిపించకుండా ఉండే అధునాతన స్టెల్త్ డిజైన్‌తో దీన్ని రూపొందించారు. దీని బరువు 6,670 టన్నులు. పొడవు 149 మీటర్లు. ఇది గంటకు 32 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు. ఎనిమిది దీర్ఘ శ్రేణి బ్రహ్మోస్ యాంటీషిప్ క్షిపణులతోపాటు 32 బరాక్ క్షిపణులు, 8 సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణులు కలిగి గాలిలో ఉన్న లక్ష్యాలను సులభంగా ఛేదిస్తుంది. అంతేకాకుండా ఒక హెచ్‌ఎఎల్ ధ్రు, సీ కింగ్ ఎంకె 42బి హెలికాప్టర్‌ను మోహరించగల సామర్థ్యం కలిగి ఉంది.